3

సాక్షి
విశాఖపట్నం

గురువారం । 10 । జూలై । 2025








రథాన్ని ప్రారంభిస్తున్న అశోక్‌గజపతిరాజు

అడుగులో అడుగేస్తూ.. అప్పన్నను స్మరిస్తూ..



- గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- ఉదయం 6 గంటల నుంచే ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు
- మధ్యాహ్నం 2 గంటలకు పుష్పరథం ప్రారంభం

సింహాచలం: ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని బుధవారం సింహగిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచే చేరుకున్న భక్తులు కొండదిగువ తొలిపావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఈసారి కూడా అధిక సంఖ్యలో యువత గిరి ప్రదక్షిణ చేశారు. తొలిపావంచా వద్ద ప్రారంభమైన భక్తుల గిరి ప్రదక్షిణ అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైలు, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, లక్ష్మినగర్, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం మీదుగా సింహాచలం చేరుకోవడంతో ముగిసింది.

వైభవంగా రథయాత్ర

కొండదిగువ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి తొలి పావంచా వద్ద బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు రథంలో ఉన్న స్వామికి పూజలు నిర్వహించారు.


తొలిపావంచా వద్ద కిటకిటలాడిన భక్తజనం

అనంతరం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకున్న లక్షలాది మంది భక్తులు స్వామి నామస్మరణ చేస్తూ రథాన్ని అనుసరించారు. తొలిపావంచా నుంచి ప్రారంభమైన రథయాత్ర అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, సత్యం జంక్షన్, ఎస్‌ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంది. రథోత్సవం ప్రారంభోత్సవంలో ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో పులివేషాలు, తప్పెటగుళ్లు, కేరళ డ్రమ్స్, కాళీ వేషాలు విశేషంగా అలరించాయి.

స్వచ్ఛంద సంస్థల సాయం

గిరి ప్రదక్షిణని పురస్కరించుకుని కలెక్టర్ హరేంధిర ప్రసాద్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. గిరిప్రదక్షిణ జరిగే 32 కిలోమీటర్ల కొండచుట్టూ 30


కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ప్రదేశాల్లో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 32 చోట్ల వైద్య శిబిరాలు, 18 అంబులెన్సులు, రెండు సూపర్ స్పెషాల్టీ వైద్య బృందాలు అందుబాటులో ఉంచి భక్తులకు వైద్య సేవలు, మందులు అందజేశారు. జీవీఎంసీ 109 ప్రదేశాల్లో 400 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతంలో తాగునీరు అందుబాటులో ఉంచింది. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఆహార పదార్థాలు, స్నాక్స్, పానీయాలు అందజేశాయి.

32 కి.మీ కాదు.. 44 కి.మీ. నడిచారు

వీఐపీ, వీవీఐపీ వారిపై ఉన్న శ్రద్ధ సామాన్య భక్తులపై లేదంటూ పోలీసులపై, ప్రభుత్వంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఐపీలకు నేరుగా తొలి పావంచా వద్దకు అనుమతించి.. సామాన్య భక్తుల వాహనాలను మాత్రం ఐదారు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేశారు. దీంతో తొలిపావంచా వరకు నడిచి.. అక్కడి నుంచి 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి.. మళ్లీ వాహనాల కోసం ఐదారు కిలోమీటర్లు నడిచి.. వాహనాల వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. దీంతో దాదాపు 44 కిలోమీటర్లకు వరకు భక్తులు నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


సమతా కాలేజ్ వద్ద భక్తుల రద్దీ


పులివేషాలు


తప్పెటగుళ్లు

మెడికల్ క్యాంపుల ఏర్పాటు


మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

మహారాణిపేట: గిరి ప్రదక్షిణ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మొత్తం 32 పాయింట్లలో మెడికల్ క్యాంపులను నిర్వహించారు. అవసరమైన 23 ప్రాంతాల్లో అంబులెన్సులను సిద్ధం చేశారు.

అప్పుఘర్ తీరంలో పుణ్యస్నానాలు


సముద్రస్నానం చేస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ : గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో అప్పుఘర్ తీరం పోటెత్తింది. భక్తుల పుణ్య స్నానాలతో తీరం కిటకిటలాడింది. పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్లు నిత్యం భక్తులను అప్రమత్తం చేశారు. తీరంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డ్రెసింగ్ రూమ్‌లు, మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచారు.

జాడలేని వరుణుడు


ఎండఎక్కువగా ఉండటంతో గొడుగులు వేసుకుని ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పెందుర్తి: ఏటా ఆషాడ చతుర్దశి నాడు 'గోవింద'నామస్మరణతో గిరి చుట్టూ తిరిగే సింహాద్రి అప్పన్న భక్తులను వరుణుడు పలకరించడం పరిపాటి. ఎంతలా అంటే గిరి ప్రదక్షిణ రోజు తప్పకుండా వర్షం పడుతుంది అన్నంతగా భక్తుల్లో నాటుకుపోయింది. కానీ ఈ ఏడాది భక్తులకు వరుణుడు మొహం చాటేశాడు. బుధవారం ఉదయం నుంచీ భానుడు నిప్పులు కురిపించాడు. దాదాపు 30 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతతో భక్తులు ఆపసోపాలు పడ్డారు. అయితే ప్రతీ ఏడాది లాగే సాయంత్రానికి వర్షం పడుతుందన్న ఆశతో ఎదురుచూసిన భక్తులకు నిరాశే ఎదురైంది. రోజంతా చుక్క వాన కాదు కదా కనీసం ఎక్కడా మేఘావృతం కూడా కనిపించలేదు.

సౌకర్యాలపై జీవీఎంసీ కమిషనర్ ఆరా


స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

అల్లిపురం: గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు అందుతున్న సౌకర్యాలను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పర్యవేక్షించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను బుధవారం అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, పర్యవేక్షక ఇంజినీర్లు పీవీ సత్యనారాయణ రాజు, గోవిందరావులతో కలసి పరిశీలించారు. నడక మార్గంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. లుంబినీ పార్కు, వెంకోజీపాలెం వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి పాయింట్లను సందర్శించారు. ప్రసాద వితరణ చేపడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను శుభ్రం చేయాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు.

సైడ్ లైట్స్


తొలిపావంచా వద్దరోడ్డుపైనే కొబ్బరికాయలు కొట్టడంతో ఏర్పడిన పెద్ద కుప్ప

- గిరి ప్రదక్షిణ ప్రారంభించేందుకు ఉదయం 6 గంటల నుంచే భక్తులు సింహాచలం చేరుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఒక్కసారిగా రద్దీ పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటలకు రథోత్సవం ప్రారంభం సమయానికి తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఇసుకేస్తే రాలనంతగా భక్తులు బీఆర్‌టీఎస్ రోడ్డులో కిక్కిరిశారు.
- ఉదయం 6 గంటలకే గిరి ప్రదక్షిణ ప్రారంభించిన పలువురు భక్తులు సాయంత్రానికే తిరిగి సింహాచలం చేరుకున్నారు. వారందరికీ రాత్రి 9 గంటల వరకు స్వామి దర్శనాలు అందజేశారు.
- తొలిపావంచా వద్దకు వెళ్లలేని భక్తులు రోడ్ల పైన, బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని ఏర్పాటుచేసిన గోడపైన కొబ్బరికాయలు కొట్టారు. దీంతో తొలిపావంచా వద్ద రోడ్డుపైనే కొబ్బరికాయచెక్కల కుప్ప పెద్ద ఎత్తున ఏర్పడింది.
- భక్తులు కొట్టిన కొబ్బరి చెక్కలు తరలించేందుకు క్రేనులు, లారీలు ఏర్పాటు చేశారు.
- దేవస్థానం బస్టాండ్‌లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అయినా తప్పిపోయిన వాళ్ల బంధువులు అక్కడికి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.
- తొలిపావంచా ఎదురుగా మధ్యాహ్నం నుంచి కొండపైకి వెళ్లే ఆర్టీసీ బస్సులు పెద్ద ఎత్తున నిలపడంతో.. అక్కడకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- పారిశుధ్య నిర్వాహణలో జీవీఎంసీ దారుణంగా విఫలమైంది. భక్తుల రద్దీ తక్కువగా ఉన్నప్పుడు కొద్దిపాటి చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తిన జీవీఎంసీ సిబ్బంది.. సాయంత్రం భక్తుల రద్దీ పెరిగేసరికి చేతులెత్తేశారు. మేయర్, అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడిక్కడే చెత్త పేరుకుపోయింది.
- 32 కిలోమీటర్లతో పాటు ట్రాఫిక్ ఆంక్షల కారణంగా మరో పది కిలో మీటర్లు అదనంగా నడిచిన భక్తులు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడ్డారు.
- గిరి ప్రదక్షిణలో మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలు తప్పిపోకుండా వారి చేతులకు ఏఐ ట్యాగ్‌లు వేశారు. గత ప్రభుత్వం హయాంలో ఈ విధానాన్ని అమలు చేయగా, ఈ ఏడాది కూడా అధికారులు కొనసాగించారు.

చోరుల చేతివాటం

గిరి ప్రదక్షిణ వేళ చోరులు చేతివాటం ప్రదర్శించారు. సింహచలం తొలి పావంచ మొదలుకొని అడవివరం, ఆరిలోవ, హనుమంతవాక, నగరంలో పలు చోట్ల మహిళల మెడలో బంగారు ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్లు, నగదు దొంగిలించినట్లు ఆయా ప్రాంతాల్లోని పోలీసులకు బాధితులు ఫిర్యాదులు చేశారు.


హనుమంతవాక వద్ద రథం

ట్రాఫిక్ ఆంక్షలతో అగచాట్లు 4లో

వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు ఊరట

- ఈ నెల 11 నుంచి కొత్త రూల్
- 8 గంటల ముందే బెర్త్‌పై స్పష్టత
- మారిన రైల్వే రిజర్వేషన్ చార్ట్ సమయాలు

తాటిచెట్లపాలెం: రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. ఇక నుంచి రిజర్వేషన్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందో లేదోనని చివరి నిమిషం వరకు టెన్షన్ పడక్కర్లేదు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ చార్ట్ తయారీ నిబంధనల్లో కీలక మార్పు చేసింది. ఇకపై రైలు బయలుదేరడానికి 4 గంటల ముందు కాకుండా.. 8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్‌ను సిద్ధం చేయనున్నారు. ఈ కొత్త విధానం ఈ నెల 11వ తేదీ నుంచి అమలులోకి రానుంది. రైల్వే తీసుకొచ్చిన ఈ నిబంధనలతో ప్రయాణికులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులకు తమ టికెట్ స్టేటస్ 8 గంటల ముందే తెలిసిపోతుంది. ఒకవేళ టికెట్ కన్ఫర్మ్ కాకపోతే.. ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను(బస్సు లేదా ఇతర రైళ్లు) చూసుకోవడానికి ప్రయాణికులకు అదనపు సమయం లభిస్తుంది. దూర ప్రాంతాల నుంచి రైల్వే స్టేషన్‌కు వచ్చేవారు, టికెట్ కన్ఫర్మ్ అయిందో లేదోనన్న ఆందోళన లేకుండా ప్రశాంతంగా స్టేషన్‌కు చేరుకోవచ్చు. రైలు మిస్ అయ్యే అవకాశాలు తగ్గుతాయి. చార్ట్ సిద్ధమైన తర్వాత కూడా టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది, కానీ అప్పటికి సీట్లు అందుబాటులో ఉండాలి. మారిన నిబంధనల ప్రకారం ఈ నెల 11వ తేదీ నుంచి ఈస్ట్‌కోస్ట్‌రైల్వే పరిధిలో కూడా రిజర్వేషన్ చార్టులు సిద్ధం కానున్నాయి. అంటే మధ్యాహ్నం 2 గంటల లోపు బయలుదేరే రైళ్లకు ముందు రోజు రాత్రి 9 గంటలకే ఫైనల్ చార్ట్ సిద్ధం అవుతుంది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత, మరుసటి రోజు ఉదయం 5 గంటలలోపు బయలుదేరే రైళ్లకు.. రైలు బయలుదేరడానికి సరిగ్గా 8 గంటల ముందు చార్ట్‌ను సిద్ధం చేస్తారు.

బదిలీపై నగరానికి రానున్న న్యాయమూర్తులు

విశాఖ లీగల్: రాష్ట్ర హైకోర్టు పలువురు అదనపు జిల్లా న్యాయమూర్తులను బదిలీ చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.హరినారాయణ అనకాపల్లి జిల్లా చోడవరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీపై వస్తున్నారు. చోడవరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రత్నకుమార్ విశాఖలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీపై నగరానికి వస్తున్నారు.

హెచ్‌ఎంల జేబుకు చిల్లు!

- గిన్నిస్ రికార్డు కోసం గురువులపై భారం
- నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్



ఆరిలోవ: 'మెగా పీటీఎం 2.0'.. ప్రధానోపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న తాపత్రయం గురువులకు ప్రాణసంకటంగా తయారైంది. ఇందుకోసం కేటాయించిన అరకొర నిధులు కూడా ఇంతవరకు హెచ్‌ఎంల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. అసలు ఆ నిధులు వస్తాయో లేదో తెలియని అనిశ్చితి నెలకొంది. దీంతో చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని హెచ్‌ఎంలు లోలోపల మదనపడుతున్నారు. కాగా, నిధులు చాలకపోతే దాతలను వెతుక్కోమని జిల్లా విద్యాశాఖ అధికారులకు విద్యాశాఖ కమిషనర్ సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ సూచనలను జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలల హెచ్‌ఎంలకు చేరవేస్తున్నారు. గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించాల్సి ఉంది. కష్టపడి మీటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు చేతి డబ్బులు కూడా ఖర్చు చేయాలా అంటూ హెచ్‌ఎంలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం.

నిర్వహణ ఖర్చులకు అరకొర కేటాయింపులు

రాష్ట్ర విద్యాశాఖ సాధారణంగా ప్రతి పాఠశాలకు నిర్వహణ కోసం ఏడాదికి కొంత నిధులు విడుదల చేస్తుంది. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య, భవనాలను బట్టి ఈ నిధులు కేటాయిస్తుంది. అయితే, ఆ నిధుల్లో కేవలం 20 శాతం డబ్బులను పీటీఎం కార్యక్రమానికి ఖర్చు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీని ప్రకారం జిల్లాలో అతి పెద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలైన చంద్రంపాలెం స్కూల్‌కు రూ. 23,000, రెండు, మూడు స్థానాల్లో ఉన్న తోటగరువు, గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వరుసగా రూ.12,000, రూ.10,000 మాత్రమే నిధులు వస్తాయి. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి పీటీఎం నిర్వహణ ఖర్చుల కింద రూ. 5,000 నుంచి రూ. 8,000 వరకు మాత్రమే కేటాయిస్తారు. గురువారం నిర్వహించనున్న పీటీఎం కార్యక్రమానికి ఈ మొత్తాలు ఏమాత్రం సరిపోవు. ప్రస్తుతం చంద్రంపాలెంలో సుమారు 3,000 మంది విద్యార్థులు, తోటగరువులో 1,300 మంది విద్యార్థులు ఉన్నారు. పీటీఎం కార్యక్రమానికి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులంతా తప్పనిసరిగా హాజరుకావాలి. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్లకు సందేశాలు పంపించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు భోజనాలు పెట్టాల్సి ఉంది. మెనూతో పాటు అదనంగా ఏదైనా కూర పెట్టాలి. ఈ లెక్క ప్రకారం చంద్రంపాలెంలో సుమారు 6,000 మంది, తోటగరువులో సుమారు 2,600 మంది, గోపాలపట్నంలో 2,000 మందికి భోజనాలు ఏర్పాటు చేయాలి. అదనపు కూర ఖర్చుతో పాటు టెంట్లు, కుర్చీలు, స్నాక్స్, మంచినీరు, టీ, అతిథులకు పూల బొకేలు వంటి ఖర్చులు ఉంటాయి. దీంతో పాటు తల్లిదండ్రులకు– మహిళలకు రంగవల్లులు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ వంటి ఆటల పోటీలు నిర్వహించి, తరగతుల వారీగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేయాలి. ఈ మొత్తం ఖర్చులకు చంద్రంపాలెం పాఠశాలకు అయితే సుమారు రూ.70,000 నుంచి 80,000 వరకు, తోటగరువు పాఠశాలకు సుమారు 50,000 వరకు, గోపాలపట్నం పాఠశాలకు సుమారు రూ. 40,000, ప్రాథమిక పాఠశాలలకు కనీసం రూ. 15,000 నుంచి 20,000 వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ అరకొర నిధులతో కార్యక్రమం ఎలా నిర్వహించాలా అంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం అధికారుల వద్ద చెప్పుకున్నా ఫలితం ఉండదని, వారిలో వారే గుసగుసలాడుకుంటున్నారు.

జిల్లాలో 3,24,683 మంది విద్యార్థులు

జిల్లాలో 1388 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 3,24,683 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, మున్సిపల్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, ఏపీ ట్రైబల్, బీసీ వెల్ఫేర్, అంధ బాలల పాఠశాలలు తదితర వాటితో పాటు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, బ్లైండ్, డఫ్ అండ్ డంబ్, మదరసాలు ఉన్నాయి. ఈ పాఠశాలలన్నింటిలోనూ గురువారం పీటీఎం 2.0 కార్యక్రమం నిర్వహించాలి. తల్లిదండ్రులను సంతోషపెట్టే విధంగా ఉపాధ్యాయులు మెలగాలి. ఈ మేరకు కార్యక్రమ నిర్వహణకు హెచ్‌ఎంలు సిద్ధమయ్యారు.

గిరి ప్రదక్షిణలో సీఎంఆర్ విశేష సేవలు


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న సీఎంఆర్ సంస్థల చైర్మన్ మావూరి వెంకటరమణ

సాక్షి, విశాఖపట్నం : గిరి ప్రదక్షిణ సందర్భంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో భక్తులకు విశేష సేవలు అందించారు. గిరి ప్రదక్షిణ రహదారిలోని 18వ కిలోమీటరు వద్ద, సీతమ్మధారలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి సమీపంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సీఎంఆర్ ఆధ్వర్యంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ నమూనా నిర్మించారు. ఈ ఆలయంలో భక్తులకు దర్శనాలు కల్పించడంతో పాటు ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. సీఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు స్వయంగా ప్రసాదాలను అందజేశారు.

భక్తుల సేవల్లో...


గిరి ప్రదక్షిణ భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ట్రాఫిక్ ఆంక్షలతో అగచాట్లు

- వేపగుంట, గోపాలపట్నం వద్దే వాహనాలు నిలిపివేత
- అటు అడవివరం, కొత్త గోశాల వద్దే నిలిచిపోయిన వాహనాలు
- మండుటెండలో కి.మీ మేర నడిచి తొలిపావంచాకు చేరుకున్న భక్తులు
- కొబ్బరికాయ కొట్టకముందే చుక్కలు చూపించిన పోలీసులు
- జామర్లు ఏర్పాటు చేయడంతో నిలిచిన సెల్‌ఫోన్ సిగ్నళ్లు?
- భారీ జన సందోహంలో తప్పిపోయిన వేలాది మంది భక్తులు


గోపాలపట్నం వైపు నుంచి అడవివరంలోని తొలిపావంచాకి నడిచి వస్తున్న భక్తులు

పెందుర్తి/సింహాచలం: గిరి ప్రదక్షిణలో ఎన్నడూ లేనంతగా భక్తులు అవస్థలు పడ్డారు. ఒకవైపు కఠినమైన ట్రాఫిక్ ఆంక్షలతో పోలీసులు, మరోవైపు మండుతున్న ఎండ.. లక్షలాది మంది భక్తుల సహనానికి పరీక్ష పెట్టాయి. సాధారణంగా గిరి ప్రదక్షిణ ప్రారంభానికి ముందు స్వామి వారి తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి మొదలుపెడతారు. కానీ ఈ సారి చాలా మంది భక్తులు తొలి పావంచా చేరుకోవడానికే తీవ్ర అవస్థలు పడ్డారు. ఎంతో ఉత్సాహంగా, అప్పన్న స్వామిపై అపార భక్తితో గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులు తొలి పావంచాకు చేరకముందే నీరసించిపోయారు. ట్రాఫిక్ ఆంక్షల కారణంగా లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు భక్తులను తొలి పావంచాకు దాదాపు నాలుగైదు కిలోమీటర్ల ముందు నుంచే నడిపించారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల తర్వాత వచ్చిన భక్తులను గోపాలపట్నం, వేపగుంట కూడళ్ల వద్ద వాహనాల్లోంచి దించేయడంతో, అక్కడి నుంచి సింహాచలంలోని తొలి పావంచాకు దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర భగభగ మండుతున్న ఎండలో నడుచుకుంటూ రావాల్సి వచ్చింది. ఇటు అడవివరం వైపు నుంచి వచ్చిన భక్తుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రెండవ ఘాట్‌రోడ్డు నుంచి తొలి పావంచా వరకు కూడా భక్తులు ఎండలో నడవాల్సి వచ్చింది. దీంతో సుదీర్ఘంగా చేయాల్సిన గిరి ప్రదక్షిణ ప్రారంభం కాకముందే చాలా మంది భక్తులు డీలా పడిపోయారు. కాళ్లకు బొబ్బలతో అల్లాడిపోయారు. మహిళలు, చిన్న పిల్లలు విలపిస్తూ తొలి పావంచా వద్దకు చేరుకున్నారు. అక్కడ కాసేపు సేద తీరి, భక్తితో ప్రదక్షిణ ప్రారంభించారు. ఈ కఠినమైన ట్రాఫిక్ ఆంక్షల కారణంగానే తాము ఇబ్బందులు పడ్డామని చాలా మంది భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ సిగ్నళ్ల అంతరాయం

సింహాచలం పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సెల్‌ఫోన్ సిగ్నళ్లు అస్తవ్యస్తంగా మారాయి. దీని వల్ల గిరి ప్రదక్షిణకు వచ్చిన అనేక మంది భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో, చేయి విడిస్తే తమ వారు కనిపించకుండా పోయే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వేలాది మంది భక్తులు తప్పిపోయారు. వారి ఫోన్‌లు కలవకపోవడంతో, వారంతా తొలి పావంచా వద్ద ఉన్న కంట్రోల్ రూమ్ వద్దకు వెళ్లి ఆరా తీశారు. కంట్రోల్ రూమ్ సిబ్బందికి క్షణం తీరిక లేకుండా పోయింది. తప్పిపోయిన వారి వివరాలను ప్రకటిస్తూ అనౌన్స్‌మెంట్‌లు చేస్తూనే ఉన్నారంటే పరిస్థితి ఎంత గందరగోళంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు పలు చోట్ల జామర్లను ఏర్పాటు చేయడం వలనే ఈ సిగ్నల్ సమస్య ఏర్పడిందని భక్తులు ఆరోపించారు.

ప్రజలకు రవాణా కష్టాలు


బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



సాక్షి, విశాఖపట్నం: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా సాధారణ ప్రజలు తీవ్ర రవాణా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గిరి ప్రదక్షిణకు బస్సులను ఎక్కువగా కేటాయించడంతో.. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. వచ్చిన బస్సుల్లో ప్రయాణించడం కూడా వారికి కష్టంగా మారింది. బస్సులు పూర్తిగా నిండిపోవడంతో, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రయాణికులు బస్సు వెనుక భాగంలో వేలాడుతూ ప్రయాణించారు. ఇదే పరిస్థితి ఆటోల్లో కూడా కనిపించింది. ఆటోల్లో కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని గమ్యస్థానాలకు చేర్చారు.

నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చా..



నేను పిఠాపురం నుంచి వచ్చాను. గోపాలపట్నం వద్ద ఆటో ఆపేశారు. గిరి ప్రదక్షిణ ప్రారంభానికి ముందే సింహాచలం రావడానికి నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. నేను మూడుసార్లు గిరి ప్రదక్షిణ చేశాను. కానీ ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు. – సుబ్బలక్ష్మి, పిఠాపురం

ఎండలోనే గోపాలపట్నం నుంచి..



నేను సబ్బవరం నుంచి వచ్చాను. ఎప్పుడూ గోపాలపట్నం వరకు వచ్చి అక్కడ ఆటో ఎక్కుతుంటాను. ఈసారి కూడా గోపాలపట్నం నుంచి వచ్చేశాను. తీరా చూస్తే అక్కడ నుంచి ఎలాంటి వాహనాలు అందుబాటులో లేవు. దీంతో ఎండలోనే నడిచి సింహాచలం చేరుకోవాల్సి వచ్చింది. – ఎస్.పద్మావతి, సబ్బవరం

వేపగుంట ముందే ఆపేశారు



నేను మాడుగుల నుంచి వచ్చాను. వేపగుంట ముందే మా వాహనం ఆపేశారు. దీంతో అక్కడ నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్లు నడిచి సింహాచలం వచ్చాను. దీంతో చాలా ఇబ్బంది పడ్డాను. మూడవసారి గిరి ప్రదక్షిణ చేస్తున్నాను. ఎప్పుడూ లేని ట్రాఫిక్ ఆంక్షలు ఈసారి పెట్టారు. – ఉష, మాడుగుల

అడవివరం ముందే ఆపేశారు



నేను శొంఠ్యాం నుంచి గిరి ప్రదక్షిణకు వచ్చాను. అడవివరం జంక్షన్‌కి ముందే బస్సు ఆటో ఆపేశారు. దీంతో అక్కడి నుంచి తీవ్రమైన రద్దీలో నడిచివచ్చాను. తొలి పావంచా వద్ద కూడా రద్దీ చూసి ఎంతో భయం వేసింది. – లలిత, శొంఠ్యాం

ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఎమ్మెల్యే బండారు

పెందుర్తి: గిరి ప్రదక్షిణ వేళ కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని సామాన్య భక్తులే కాదు.. కూటమి ప్రజాప్రతినిధులు కూడా చవిచూశారు. సింహాచలం గిరిప్రదక్షిణ సందర్భంగా వేపగుంట కూడలి వద్ద ట్రాఫిక్‌లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దాదాపు 2 గంటలకు పైగా ఇరుక్కుపోయారు. సింహాచలం వెళుతున్న ఆయన ఒక్కసారిగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో విశాఖ జిల్లా ట్రాఫిక్ అధికారులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్లు తెలిసింది. 'ట్రాఫిక్ నియంత్రణ ఇదా.. ఏంటి ఈ ఏర్పాట్లు' అంటూ పోలీస్ అధికారులపై చిందులు తొక్కినట్లు సమాచారం. వాస్తవానికి ఒక్క బండారే కాదు.. అనేక మంది ప్రజాప్రతినిధులతో పాటు వేలాది మంది భక్తులు కూడా ట్రాఫిక్ ఇబ్బందులను తీవ్రస్థాయిలో ఎదుర్కొన్నారు.

11న పబ్లిక్ అండర్ టేకింగ్స్ హౌస్ కమిటీ రాక

మహారాణిపేట: విశాఖపట్నంలో ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్స్ శాసన సభా కమిటీ పర్యటించనుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన 8 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలతో కూడిన ఈ కమిటీ శుక్రవారం ఉదయం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరుకుని సర్క్యూట్ హౌస్‌కు వెళ్తుంది. అదే రోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో వీఎంఆర్డీఏ, ఏపీ మెడ్‌టెక్ జోన్, ఏపీఐఐసీ, ఏపీ టూరిజం, శ్రీకాకుళం స్మార్ట్ సిటీ కార్పొరేషన్, విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌ల వార్షిక నివేదికలు, కార్యకలాపాలపై అధికారులతో కమిటీ సభ్యులు సమీక్ష నిర్వహిస్తారు. 12వ తేదీ ఉదయం కలెక్టరేట్‌లో ఏపీఈపీడీసీఎల్, ఏపీసీ–ఏఎంటీజెడ్ మెడి వ్యాలీ ఇంక్యుబేషన్ కౌన్సిల్, ఏపీ గిరిజన కార్పొరేషన్, బయో వ్యాలీ ఇంక్యుబేషన్ కౌన్సిల్, వైజాగ్ అపెరెల్ పార్క్, ఏపీఎస్ఆర్టీసీల వార్షిక నివేదికలు, కార్యకలాపాలపై సమీక్ష చేస్తారు.

నేడు మేఘాలయ హౌస్ కమిటీ రాక

మహారాణిపేట: మేఘాలయ రాష్ట్ర శాసన సభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ స్టడీ టూర్ నిమిత్తం గురువారం విశాఖపట్నం చేరుకోనుంది. 11న విశాఖ నగరంలో పలు ప్రదేశాలను సందర్శిస్తుంది. 12వ తేదీ విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వెళ్తుంది.

హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌లు వద్దేవద్దు

- ఏజెన్సీలో గిరిజనులకు చాలా నష్టం
- విశాఖకు తాగునీటి కష్టాలు
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్లకార్డులతో నిరసన
- సభ్యుల సూచన మేరకు ప్రాజెక్ట్‌ల రద్దుకు తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర


ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసిన వైఎస్సార్ సీపీ, సీపీఎం సభ్యులు

మహారాణిపేట: అనంతగిరి మండలం గుజ్జెలి, చిట్టంవలసలో ప్రతిపాదిత హైడ్రో పవర్ ప్రాజెక్టుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రో పవర్ ప్రాజెక్టు సర్వేను తక్షణమే నిలిపివేయాలని, ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని బుధవారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతగిరి జెడ్పీటీసీ(సీపీఎం) సభ్యుడు డి.గంగరాజు ఈ అంశాన్ని తొలుత లేవనెత్తుతూ, ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్టు అమలు చట్ట విరుద్ధమని, ఇది గిరిజన చట్టాలను, 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తుందన్నారు. అదానీ, నవయుగ కంపెనీలు ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నాయని, గ్రామసభల నిర్వహణపై తమకు ఎలాంటి సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల రైవాడ జలాశయం నీరు కలుషితమై విశాఖ నగర తాగునీటి సరఫరాకు, రైతులకు ఇబ్బందులు వస్తాయని గంగరాజు హెచ్చరించారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ ఇలాంటి ప్రాజెక్టుల వల్ల ఏజెన్సీకి ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కూడా డిమాండ్ చేశారు. దీనిపై అల్లూరి సీతారామరాజు కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పందిస్తూ.. అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని, గ్రామసభలు నిర్వహించి, తీర్మానాలు చేసిన తర్వాత మాత్రమే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. అరకు ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు ఈర్లె అనురాధ, చెట్టి రోషిణి, కె.నూకరాజు, సన్యాసి రాజు, ఎంపీపీ బి.రమేష్ బాబు, సీపీఎం సభ్యుడు గంగరాజు తదితరులు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

కేజీహెచ్‌లో మెరుగైన సేవలందించాలి

ఉచిత విత్తనాలు అందించాలని, రైతు భరోసాకు సంబంధించి రైతుల సంఖ్య గతంలో కన్నా ఇప్పుడు తగ్గడానికి కారణాలు తెలియజేయాలని పలువురు సభ్యులు కోరారు. గిరిజనులకు కేజీహెచ్‌లో సరైన వైద్యం అందడం లేదని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్షలు వసూలు చేస్తున్నారని గంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి వివరాలు అందజేస్తే విచారణ చేస్తామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ చెప్పారు. గత ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ సర్వే కొనసాగుతుందా? ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి తెలపాలని సభ్యులు కోరగా.. విశాఖ కలెక్టర్ మాట్లాడారు. 250 ఎకరాలు ఒక బ్లాక్‌గా తీసుకొని రీసర్వే జరుగుతుందన్నారు. కేజీహెచ్‌లో ఎస్టీ సెల్ సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గిరిజన ప్రాంతాల నుంచి కేజీహెచ్‌కు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అంబులెన్సులు తక్కువగా ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై అల్లూరి కలెక్టర్ దినేష్ కుమార్ స్పందిస్తూ సీఎస్సార్ నిధులు వెచ్చించి అంబులెన్సులను అందుబాటులోకి తెస్తామన్నారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో రౌడీషీటర్ హత్య

- మాధవధారలో దారుణం
- పోలీసుల అదుపులో నిందితులు


లోహిత్ మృతదేహం

గోపాలపట్నం: నగరంలో మరో దారుణ హత్య చోటుచేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో ఓ రౌడీషీటర్‌ను ప్రత్యర్థివర్గం దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని మాధవధారలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెందుర్తి పరిధిలోని పులగానిపాలేనికి చెందిన మాసపు లోహిత్ (20), అలియాస్ నాని.. మాధవధారలో మంగళవారం రాత్రి జరిగిన కుంచుమాంబ అమ్మవారి పండగకు హాజరయ్యాడు. గతంలో లోహిత్ మాధవధార వుడాకాలనీలో నివసించేవాడు. పండగలో స్నేహితులతో కలిసి ఉన్న సమయంలో.. మాధవధార మహత్ కాలనీకి చెందిన ఎద్దు హేమంత్ అలియాస్ శ్రీరామ్ తన స్నేహితులతో కలిసి లోహిత్‌తో వాగ్వాదానికి దిగాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో లోహిత్ అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించాడు. అయితే హేమంత్, అతని స్నేహితులు లోహిత్‌ను వెంబడించి, విచక్షణారహితంగా కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో లోహిత్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు అక్కడకు చేరుకుని లోహిత్‌ను కేజీహెచ్‌కు తరలించారు. లోహిత్ అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు.

పాత కక్షలే కారణం : గతంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా లోహిత్ బృందానికి, హేమంత్ బృందానికి మధ్య తీవ్రమైన గొడవలు జరిగాయి. ఈ గొడవల కారణంగా లోహిత్‌పై రౌడీషీట్ కూడా తెరిచాడు. అతను జైలుకు కూడా వెళ్లివచ్చాడు. కుంచుమాంబ పండగకు లోహిత్ వస్తాడని ముందుగానే తెలుసుకున్న హేమంత్ వర్గం.. పక్కా ప్రణాళికతోనే ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అదుపులో నిందితులు : ఈ హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడు ఎద్దు హేమంత్‌తో పాటు మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో కుంచమాంబ కాలనీకి చెందిన బలగ శ్యామలరావు, బలగ సురేష్, మాధవధారకు చెందిన సనపల వంశీ, సీతన్న గార్డెన్‌కు చెందిన గడ్డవలస సురేష్ ఉన్నారు. ఈ కేసులో ప్రమేయం ఉన్నట్లుగా అనుమానిస్తున్న మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. లోహిత్‌కు తల్లిదండ్రులు స్వాతి, సంజీవరావు. ఒక తమ్ముడు ఉన్నారు. మృతుడి తల్లి స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు సీఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోపాలపట్నం కొత్తపాలెంలో ఇటీవలే జరిగిన కత్తి దాడి ఘటన మరువక ముందే ఈ హత్య జరగడంతో స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

గిరి ప్రదక్షిణకు వెళ్తూ ప్రమాదం

- బోల్తాపడిన ఆటో
- దివ్యాంగురాలి మృతి
- మరో నలుగురికి గాయాలు


ఆటో బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన శాంతి


క్షతగాత్రులను 108లో కేజీహెచ్‌కు తరలిస్తున్న సిబ్బంది

సబ్బవరం : మండలంలోని పినగాడి–కోటపాడు రోడ్డులో అయ్యన్నపాలెం వద్ద బుధవారం సాయంత్రం ఓ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న యువతి అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో కేజీహెచ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు స్నేహితులంతా (చెవిటి, మూగవారు) కలిసి సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వీరంతా మురళీనగర్‌లోని 'గ్రోత్ ఇన్‌స్టిట్యూట్ ట్రైనీ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ 'లో శిక్షణ పొందుతున్నారు. మురళీనగర్ నుంచి ఆటోలో సబ్బవరంలోని అయ్యన్నయ్య పాలెం వద్ద ఉన్న రైవాడ కాలువలో స్నానం చేయడానికి వెళ్లారు. స్నానమాచరించిన అనంతరం ఇన్‌స్టిట్యూట్ వెళ్లి అక్కడ నుంచి గిరి ప్రదక్షిణకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆటోలో వస్తుండగా, అయ్యన్నపాలెం సమీపంలో రోడ్డుపై పాము కనిపించింది. పామును తప్పించే క్రమంలో ఆటో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో, చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్. శాంతి(22) సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. గాయపడిన ఇతర స్నేహితులు విజయనగరం ప్రాంతానికి చెందిన కె. రాజ్యలక్ష్మి, కె. ధనలక్ష్మి, విశాఖ ప్రాంతానికి చెందిన ఆనంద్‌కుమార్, పరవాడలోని దల్లెపాలెంకు చెందిన సి.హెచ్. నరేంద్రలను వెంటనే కేజీహెచ్‌కు తరలించారు.

మృతురాలు శాంతి స్వగ్రామం అనంతగిరి మండలం తట్టవలస అని, ప్రస్తుతం ఆమె డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐ రామచంద్రరావు, ఎస్ఐ సింహాచలం వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

రైల్వే జోన్‌కు అడ్డంకులు సృష్టిస్తున్నారు

తాటిచెట్లపాలెం: దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకర్రావు ఆరోపించారు. జోన్ ప్రకటించిన ఐదేళ్ల వరకు కనీసం డీపీఆర్ సిద్ధం చేసేందుకూ చొరవ చూపలేదన్నారు. 2019 ఆగస్టు 26న రైల్వే బోర్డుకు డీపీఆర్ సమర్పించారని, వెంటనే దాన్ని ఆమోదించి, గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయాల్సిన కేంద్రం ఆ ఏడాది డిసెంబరు 26న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు ఆమోదం తెలిపిందన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు భూముల కేటాయింపు పూర్తయి, ప్రధాని శంకుస్థాపన చేసి ఆరు నెలలైనా ఇప్పటి వరకు అధికారిక గెజిట్ విడుదల చేయకపోవడం ఆక్షేపణీయమన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌ను ఎటువంటి గెజిట్ నోటిఫికేషన్ లేకుండా నియమించడంతో ఈ నాలుగు డివిజన్లలో ఎటువంటి పరిపాలనాధికారాలు జీఎంకు లేకుండా పోయాయన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు కొత్త జనరల్ మేనేజర్‌ను నియమించడంతోనే జోన్ పనిచేయడం ప్రారంభమైందన్నట్లు ప్రజలను నమ్మించారని పేర్కొన్నారు. వెంటనే గెజిట్ జారీకి చొరవ చూపాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

పారదర్శకంగా ఆన్‌లైన్ బుకింగ్ సేవలు

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏకి చెందిన అన్ని రకాల కల్యాణ మండపాల బుకింగ్ విధానం పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బుకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ తెలిపారు. బుధవారం వీఎంఆర్డీఏ బాలల థియేటర్‌లో ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. అన్ని ఫంక్షన్ హాళ్లు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అవసరమైన తేదీల్లో ఆన్‌లైన్‌లో చూసుకుని బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు.

అదానీ గంగవరం పోర్టుకు రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు


అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న మంత్రి

పెదగంట్యాడ: ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరాలకు గాను అదానీ గంగవరం పోర్టుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డును అందజేసింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా పోర్టు ప్రతినిధులు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజారోగ్యం కోసం తమ పోర్టు ఆధ్వర్యంలో నిరంతరం వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ సేవలను గుర్తించి ఈ అవార్డును అందించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కూడా తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఎన్‌హెచ్–16ను అనుసంధానిస్తూ పెదగంట్యాడ, గంగవరం రోడ్డులో ఆరు చోట్ల ట్రాఫిక్ లైట్లను ఏర్పాటు చేశామని, దీనివల్ల రోడ్డు ప్రమాదాలను కొంత మేర నివారించగలిగామని వెల్లడించారు. రోడ్డు భద్రత, ఆరోగ్య సంరక్షణ కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను వెచ్చిస్తున్నామని తెలిపారు.